# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-05-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. అభివృద్ధి సూచీలో భవిష్యత్తులో అమరావతి, హైదరాబాద్ నగరాలు అగ్రస్థానాల్లో ఉంటాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
2. తెలంగాణలో పోడు భూములను వ్యవసాయ యోగ్యంగా మార్చడం కోసం “ఇందిర సౌర గిరి జల వికాసం” పథకాన్ని ముఖ్యమంత్రి ఏ .రేవంత్ రెడ్డి ఈ రోజు ప్రారంభిస్తారు.
3. ఆంధ్రప్రదేశ్‌లోని స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న 28 స్థానాలకు ఈరోజు ఉపఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహించనుంది.
4. చార్మినార్ గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాదంలో మృతుల కుటుంబాలకు 5లక్షల రూపాయల పరిహారాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.
5. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఏపీ ఈఏపీసెట్-2025 పరీక్షలు ఈరోజు నుంచి ప్రారంభమవుతున్నాయి.

=========================

అభివృద్ధి సూచీలో భవిష్యత్తులో అమరావతి, హైదరాబాద్ నగరాలు మొదటి, రెండవ స్థానాల్లో ఉంటాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఒక ప్రయివేట్ మీడియా సంస్థ కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో రెండు నగరాలు కీలక పాత్ర పోస్తిస్తాయని అన్నారు. అమరావతి ఆర్థిక వనరుల సృష్టికి చిరునామాగా ఉంటుందని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ,..

..వాయిస్..24 సెకన్లు

--------------------------

తెలంగాణలో పోడు భూములను వ్యవసాయ యోగ్యంగా మార్చేలా రూపొందించిన ఇందిర సౌర గిరి జల వికాసం పథకాన్ని ముఖ్యమంత్రి ఏ .రేవంత్ రెడ్డి ఈ రోజు ప్రారంభిస్తారు. నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ-ఐటీడీఏ పరిధిలోని అమ్రాబాద్ మండలం మాచారంలో ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.రాష్ట్రంలో అటవీ హక్కుల చట్టం కింద 6 లక్షలకు పైగా ఎకరాల విస్తీర్ణానికి 2 లక్షల మందికి గిరిజన రైతులకు పోడుపట్టాలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో విద్యుత్తు సౌకర్యంలేని 6 లక్షల ఎకరాలకు ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు. ఈ పథకం కింద తొలి ఏడాదికి 10 వేల మంది రైతులకు చెందిన 27 వేల

184 ఎకరాలను సాగులోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని స్థానిక సంస్థల్లో రాజీనామాలు, సభ్యులు మృతిచెందిన కారణంగా ఖాళీగా ఉన్న 28 స్థానాలకు ఈరోజు ఉపఎన్నికలనురాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహించనుంది. ఈ ఏడాది మార్చి 27, 28 తేదీల్లో ఎన్నికలు వాయిదా పడిన శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట, రామగిరి, పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి, అత్తిలి మండల పరిషత్ అధ్యక్ష స్థానాలకు, అత్తిలి, పల్నాడు జిల్లా కారంపూడి, నరసరావుపేట, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా దగదర్తి వైస్ ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. అలాగే మహా విశాఖ నగరపాలక సంస్థ –జీవీఎంసీ డిప్యూటీ మేయర్, బొబ్బిలి, ఆదోని, కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్, తిరువూరు నగర పంచాయతీ ఛైర్‌పర్సన్, కదిరిలో రెండు వైస్ ఛైర్‌పర్సన్ స్థానాలు, పది మండల పరిషత్ ఉపాధ్యక్షుల స్థానాలకూ ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

---------------------------

చార్మినార్ గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాదంలో మృతుల కుటుంబాలకు 5లక్షల రూపాయల పరిహారం ఇవ్వనున్నట్లు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. హైదరాబాద్ లో మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహాతో కలిసి ఆయన నిన్న ఘటనాస్థలిని పరిశీలించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, షార్ట్ సర్క్యూట్ ద్వారా ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని చెప్పారు. ఈ ఘటనపై అన్ని శాఖల అధికారులతో చర్చిస్తూ, ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని తెలుపుతూ,

వాయిస్ .. 30 సెకన్లు

కాగా హైదరాబాద్ చార్మినార్ సమీపంలోని గుల్జార్ హౌస్ భవనంలో జరిగిన అగ్నిప్రమాదంలో 17 మంది మృతిచెందినట్లు అధికారులు ప్రకటించారు.

---------------------------

పహల్గాం ఉగ్రవాదుల కాల్పుల్లో అసువులు బాసిన భారత పౌరులకు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జవాన్ మురళీ నాయక్‌లకు నివాళిగా తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలో తిరంగా ర్యాలీని గత సాయంత్రం నిర్వహించారు. గాంధీ విగ్రహం నుండి గణపతి సెంటర్ వరకు కొనసాగిన ఈ ర్యాలీలో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

మరోవైపు ఏలూరు జిల్లా నూజివీడు మండలం చాట్రాయిలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తిరంగార్యాలి జాతీయ సమైక్యతకు నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు. నెల్లూరులో జరిగిన తిరంగా ర్యాలీలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... జమ్మూ కాశ్మీర్లోని

పహల్ గావ్ లో జరిగిన ఉగ్ర దాడికి ఆపరేషన్ సిందూర్ తో భారత్ సరైన సమాధానం చెప్పిందని అన్నారు.

---------------------------

ఆపరేషన్ సిందూర్ విజయానికి మద్దతుగా, భారత సైనికుల పరాక్రమానికి దేశం గౌరవ వందనాలను తెలుపుతోంది. సాయుధ దళాలకు సంఘీభావంగా, ఆకాశవాణి వార్తా విభాగం ప్రత్యేక కథనాన్ని అందిస్తోంది. ఇందులో భాగంగా కార్గిల్ యుద్ధంలో అసాధారణమైన ధైర్యసాహసాలను ప్రదర్శించిన రైఫిల్ మెన్ సంజయ్ కుమార్ గురించి ఈ రోజు తెలుసుకుందాం.

వాయిస్ ..36 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 2025-26 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్, ఫార్మసీ, వ్యవసాయ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీ ఈఏపీసెట్-2025 పరీక్షలు ఈ రోజు నుంచి ప్రారంభమవుతున్నాయి. ఉన్నత విద్యామండలి నేతృత్వంలో జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పరీక్షలు ఈనెల 27 వరకు జరుగుతాయని సెట్ కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు మొత్తం 3 లక్షల 61 వేల 536 దరఖాస్తులు వచ్చాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 143, హైదరాబాద్, సికింద్రాబాద్‌ల్లో రెండు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 27న అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షల కీ, 28న ఇంజినీరింగ్ పరీక్షల కీ విడుదల చేస్తామని తెలిపారు.

---------------------------

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో మరో రెండు మూడు రోజుల పాటు భిన్న వాతావరణం కొనసాగనుందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా గంటకు 30 నుంచి 40 కిమీ వేగంతో ఈదురుగాలులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. రాయలసీమ జిల్లాల్లో మాత్రం ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు పడే సూచనలున్నాయని పేర్కొంది.

తెలంగాణలోనూ ఈ రోజు నుంచి నాలుగు రోజులపాటు తేలికపాటి వర్షాలు కురుస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు వీచే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================